dctelugu.com

డిస్ట్రిక్ కాలమ్
జిల్లాల వార్తావాహిని
e-PAPER

కరీంనగర్ | సపుంటి: 01 | సంచిక: 30 | శనివారం 19 సెప్టెంబర్ 2026

## కరీంనగర్ సిటీ సమాచారం

# వెదురే.. 'గ్రీన్ గోల్డ్'!

**వెదురు సాగును ప్రోత్సహించాలి..**

**అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి**

**తొలిసారిగా ప్రపంచ వెదురు దినోత్సవం..**

**కరీంనగర్ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహణ**

**కరీంనగర్, సెప్టెంబర్ 18 డీసీ :**
పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధిని అందించగల వెదురు సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కరీంనగర్ అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వెదురును 'గ్రీన్ గోల్డ్'గా అభివర్ణించిన ఆయన.. వెదురు వృత్తిపై ఆధారపడిన మేదరి కులస్థులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా ప్రపంచ వెదురు దినోత్సవాన్ని కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించింది. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ, అదనపు కలెక్టర్ స్వామి, బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం. అనిల్ ప్రకాష్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. వెదురు సాగుతో పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు స్థిరమైన ఆదాయ మార్గాలు లభిస్తాయని పేర్కొన్నారు. తరతరాలుగా వెదురు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మేదరి కులస్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని తెలిపారు. ప్రపంచ వెదురు సంస్థ (ఔడీూ) 2009 నుంచి ప్రపంచ వెదురు దినోత్సవాన్ని నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పనలో వెదురుకు ఉన్న ప్రాధాన్యతను ప్రజలకు వివరించడమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

**వృత్తి సమస్యలను అధికారుల దృష్టికి..**
కార్యక్రమానికి హాజరైన మేదరి కుల ప్రతినిధులు తమ వృత్తి ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెదురు లభ్యత, వృత్తి పరిరక్షణ, ఉపాధి అవకాశాలు, వెదురు ఉత్పత్తులకు మార్కెటింగ్ తదితర అంశాలపై తమ సమస్యలను వివరించారు.

ఈ కార్యక్రమంలో మేదరి కుల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతల మల్లేశం, కార్యనిర్వాహక అధ్యక్షుడు అలిపిరెడ్డి చంద్రమౌళి, బొల్లం రామస్వామి, ఎనుగందుల రమేష్, బొమ్మిడి వేణుగోపాల్, బొల్లం నారాయణ, మొలుగూరి రవీందర్, అలిపిరెడ్డి రామస్వామి, మొగులూరి రాజ్ కుమార్, చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌ఫామ్ సాగు లక్ష్యాన్ని చేరాలి

**వెయ్యి ఎకరాల్లో సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలి**

**కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్ :** జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆయిల్‌ఫామ్ సాగును విస్తరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. కరీంనగర్ జిల్లాలో ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తూ, పంట సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించి వారిని ముందుకు తీసుకురావాలని సూచించారు.

జిల్లాలో ఆయిల్‌ఫామ్ సాగు పురోగతిపై కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం రాత్రి తన ఛాంబర్‌లో ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ చింతల రోహిత్, జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్ తో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా సాగు విస్తీర్ణం, రైతులను ప్రోత్సహిస్తున్న విధానం, లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఏఈవోలకు మండలాల వారీగా లక్ష్యాలు

ఆయిల్‌ఫామ్ సాగు విస్తరణలో భాగంగా ప్రతి ఏఈవోకు 25 ఎకరాల చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించి, రైతులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో ఆయిల్‌ఫామ్ సాగును మరింత విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఈ రెండు మండలాల్లో ఒక్కొక్క మండలంలో 50 ఎకరాల చొప్పున ఆయిల్‌ఫామ్ సాగు జరిగేలా రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు.

చిగురుమామిడి మండలంలో సుమారు 25 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ నర్సరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. నర్సరీ ఏర్పాటుతో రైతులకు అవసరమైన మొక్కల లభ్యతకు మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నందున, ఈ పంట వైపు రైతులను మళ్లించేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించి రైతులకు సాగు విధానం, ప్రయోజనాలు, అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

# ఎస్సారెస్పీ భూములను పరిశీలించిన కలెక్టర్



**సైదాపూర్ డీసీ :**
మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలో ఎస్సారెస్పీకి సంబంధించిన భూములను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు నాలుగు సర్వే నంబర్ల పరిధిలో ఉన్న సుమారు 24 ఎకరాల భూమి వివరాలను పరిశీలించిన కలెక్టర్.. భూమి ప్రస్తుత పరిస్థితి, వినియోగం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సైదాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్‌ను అడిగి భూమికి సంబంధించిన పలు వివరాలను తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ భూమి ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉందా? అనే అంశంపై క్షేత్రస్థాయి పరిస్థితులను కలెక్టర్ పర్యవేక్షించారు. భూమికి సంబంధించిన సర్వే నంబర్లు, విస్తీర్ణం, రెవెన్యూ రికార్డుల్లో నమోదైన వివరాలను పరిశీలించి సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో బాల సదన్, శిశు గృహ పరిశీలన



**కరీంనగర్ డీసీ**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జ్ యశ్వంత్ సింగ్ పట్టణంలోని బాల సదన్ శిశుగ్రహాలను సందర్శించారు చిన్నారులతో ముచ్చటిస్తూ కష్టపడి చదువుకుని ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు., బాలసదన్ లోని సౌకర్యాలను పరీక్షించారు ముఖ్యంగా శిశు గృహ లోని పిల్లలని వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు, బాలసదన్ లో అందుతున్న సౌకర్యాల గురించి పరీక్షించి, అందుతున్న సౌకర్యాలు పాటిస్తున్న శుభ్రత పట్ల అసంతృప్తి వ్యక్తం చేసి అతి త్వరగా బాలసదన్ లో పిల్లలకు సౌకర్యాలను మెరుగుపరిచి తప్పనిసరిగా పరిశుభ్రతను పాటించాలని అధికారులకు ఆదేశాలు అందజేశారు, బాలసదన్ లో కల్పిస్తున్న సౌకర్యాల పట్ల పాటిస్తున్న శుభ్రత పట్ల చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారిని కోరారు. వంట మరియు ఆహార పదార్థాలను నిలువచేసే గదులను పరీక్షించారు, ఈ సందర్భంగా ఎలాంటి న్యాయపరమైన లేదా న్యాయ సేవ అవసరమైన సంప్రదించవలసిందిగా ఆదేశించారు, ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి తో పాటు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సరస్వతి, లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, న్యాయ శివాధికార సంస్థ సభ్యులు కిరణ్ కుమార్, జిల్లా బాలల సంరక్షణ అధికారి పర్వీన్ శిశు గ్రుహ, బాల సదన్ నిర్వాహకులు పాల్గొన్నారు




